క్లుప్తంగా

లెక్చరర్‌కు డాక్టరేట్


సదానందం

నర్సంపేట : పట్టణానికి చెందిన లెక్చరర్ మొగిలిచెర్ల సురేందర్‌కు ఉస్మానియ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బ్యాక్ టవర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 'వరి పంటల దిగుబడి పెంపు కోసం హైబ్రిడ్ మెషన్ లెర్నింగ్, సమగ్ర పంట నిర్వహణ సాంకేతికతల ఆధారంగా అభివృద్ధి చేసిన ప్రిసిషన్ అగ్రికల్చర్ ఫ్రేమ్‌వర్క్' అంశంపై ప్రొఫెసర్ ఉపేంద్ర కుమార్ పర్యవేక్షణలో సురేందర్ పరిశోధన పూర్తి చేశారు. సురేందర్‌ను మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం, తదితరులు అభినందించారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ



గీసుకొండ : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో సీఐ మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల గడువుతోపాటు షాపుల లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, తదితరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వం అనుమతించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలనే విక్రయించాలని స్పష్టం చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, ఇతర నిబంధనలు పాటించాలని కోరారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు



నల్లబెల్లి : సోషల్ మీడియా వేదికగా మొబైల్‌కు వచ్చే ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయొద్దని ఎస్సై గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్స్ పంపిస్తూ మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేస్తే మొబైల్‌లో ఉండే సమాచారంతోపాటు డాటా, బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు గల్లంతయ్యే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

పరామర్శ



పర్వతగిరి : పర్వతగిరి మాజీ ఎంపీపీ లూనావత్ కమల పంతులు కుమారుడు లూనావత్ సతీశ్ ఇటీవల వాహన ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జోరిక రమేశ్, మాదుగుల రాజు, షబ్బీర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరికి చెందిన మాజీ వార్డు సభ్యుడు చీకటి రాజు తల్లి లక్ష్మి ఆదివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధన రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కడ్దూరి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన గాదం కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనకు బాల్యస్నేహితుడైన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును కుమారస్వామికి స్థానిక నాయకులు వీరగోని రాజ్‌కుమార్, గోనె మల్లారెడ్డి, మాదాసి రాంబాబు, గోనె లింగమూర్తి, మేడిద కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేశ్ తదితరులు అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రుణమాఫీకి ఎదురు చూపులు

- కొర్రీలతో 1500 మందికి పెండింగ్



పర్వతగిరి : మండల వ్యాప్తంగా సుమారు 1500 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డులు లేవని, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైందని, తదితర కొర్రీలతో అర్హులైన రైతులకు రుణమాఫీ నిధులు అందలేదు. అయినా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులతోపాటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతులకు రూ.2 లక్షల రుణం రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి అమలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండల పరిధిలోని 33 గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది రైతులకు సంబంధించి రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. దీంతో తాము అర్హులమైనప్పటికీ ఇతరులకు ఇచ్చి మాకు ఎందుకు ఇవ్వలేదంటూ పలువురు రైతులు అధికారుల, నాయకుల చుట్టూ తిరిగారు. కొందరికి రేషన్ కార్డులు లేవని, మరికొందరికి ఆధార్ కార్డు నంబర్ తప్పుగా నమోదైందని, ఇంకొందరికి అసలు ఎందుకు అందలేదో తెలియదని సమాధానం వచ్చింది. మండలంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలో 400 మందికి, పంజాబ్ నేషనల్ బ్యాంకు పరిధిలో 30 మందికి, పర్వతగిరి పీఏసీఎస్ పరిధిలో 393 మందికి, చౌటపల్లి పీఏసీఎస్ పరిధిలో 400 మందికి రుణమాఫీ కాలేదని గణాంకాలు చెబుతున్నాయి. అధికారులూ నిర్ధారించారు. అలాగే అన్నారంలోని కెనరా బ్యాంకు, నెక్కొండ ఎస్‌బీఐ, ఏనుగల్ గ్రామీణ వికాస బ్యాంకు, సంగెం ఎస్‌బీఐ, పంతిని ఐఓబీ పరిధిలో సుమారు 400 మంది రైతులకు రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమకాలేదు.

నాయకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే..

తమకు రుణమాఫీ అందకపోవడానికి రాజకీయ పార్టీల నాయకుల, అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధిత రైతులు బహిరంగంగానే మండిపడుతున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్లే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు అర్హులకు రుణమాఫీ వర్తింపజేయడంలో పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు సైతం కొర్రీలు పరిష్కరించి అర్హులకు ఇప్పించాల్సిన బాధ్యతను విస్మరించారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే రుణమాఫీ చేయాలట



నాకున్న వ్యవసాయ భూమిలో పంట సాగు కోసం బ్యాంకులో రూ.80 వేల రుణం తీసుకున్నా. నా కుమారుడు రూ.60 వేల రుణం తీసుకున్నాడు. ఇద్దరికీ కలిపి రూ.1.40 లక్షలు రుణం మాఫీ కావాల్సి ఉంది. అయినా రుణమాఫీ వర్తించలేదు. సమస్యను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారికి సంబంధం లేనట్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వమే రుణమాఫీ చేయాలని చెబుతున్నారు.

- కోట మల్లయ్య రైతు, పర్వతగిరి

ఆధార్ నంబర్ తప్పుగా నమోదైంది



నాకున్న ఎకరం భూమిలో పంట సాగు కోసం బ్యాంకు నుంచి రూ.90 వేల అప్పు తీసుకన్నా. మా కుటుంబంలో ఎవరు కూడా బ్యాంకు నుంచి రుణం తీసుకోలేదు. ఆధార్ నంబర్ తప్పుగా నమోదైందని నాకు రుణమాఫీ చేయలేదు. ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయడంలో పొరపాటు జరిగిన క్రమంలో సరిచేసి ప్రభుత్వానికి పంపించి రుణమాఫీ చేయించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

-రంగు కుమారస్వామి రైతు, పర్వతగిరి

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి



మండల పరిధిలో మొత్తం 1500 మంది రైతులకు రుణమాఫీ అమలు కావాల్సి ఉంది. రేషన్ కార్డు లేదని, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైందని, అకారణంగా కొందరికీ అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ వర్తించలేదు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి. అధికారులు కొర్రీలను పరిష్కరించి అర్హులందరికీ రుణమాఫీ అందేలా చూడాల్సి బాధ్యత ఉంది.

- మోటపోతుల మనోజ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రేణులు ప్రజలతో మమేకమై గత పదేళ్లలో అందించిన పథకాలపై చైతన్యవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజిడి గజేందర్‌రెడ్డి, యువజన నాయకులు ఐత ప్రవీణ్, పాడిచర్ల రాకేశ్, మైలారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుగులోతు విజయ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. రానున్న అన్ని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు జయకేతనం ఎగరేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, మధూకర్‌రెడ్డి, కుక్కల భాస్కర్, బెల్లి పెద్దాపురం, చందునాయక్, ఉల్లెంగుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసిన సీడ్స్, పెస్టిసైడ్స్ పట్టివేత

- ఫర్టిలైజర్ షాపుపై కేసు


స్వాధీనం చేసుకున్న సీడ్స్, పెస్టిసైడ్స్‌తో సీఐ రాజగోపాల్, పోలీసులు

పర్వతగిరి : మండలంలోని తురుకల సోమారం శివారు గుంటూరుపల్లిలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్ షాప్‌లో గడువు ముగిసిన సీడ్స్, పెస్టిసైడ్స్‌ను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడారు. సదరు ఫర్టిలైజర్ షాపులో తనిఖీ నిర్వహించగా రూ.3.50 లక్షల విలువైన గడువు ముగిసిన సీడ్స్, పెస్టిసైడ్స్ లభించినట్లు తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై బోగం ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

- రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి


జానారెడ్డితో జైపాల్‌రెడ్డి, నాయకులు

నల్లబెల్లి : తెలంగాణ రెడ్డి కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించడంతోపాటు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, విధివిధానాలు రూపొందాలని తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డిని ఆదివారం కలిసి మాట్లాడారు. కార్పొరేషన్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. జానారెడ్డిని కలిసిన వారిలో నాయకులు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, చందుపట్ల నర్సింహారెడ్డి, నల్ల సంజీవరెడ్డి, బుట్టం మాధవరెడ్డి, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, అప్పమ్మగారి రామిరెడ్డి, చిటుకుల నర్సింహారెడ్డి, ఏనుగు సంతోశ్‌రెడ్డి, సంధి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొంగులేటి, ఎమ్మెల్యే రాక



రాయపర్తి : నేడు మండల కేంద్రానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రానున్నట్లు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో నేడు తలపెట్టిన సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి శ్రేణులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హామ్యానాయక్ మాట్లాడారు. మండల కేంద్రంలో రూ14.17 కోట్ల అంచనా వ్యయంతో 20 వేల టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని తెలిపారు. సాయంత్రం 4:30 గంటలకు స్థానిక రైతు వేదిక పక్కన సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జులు పెదగాని సోమన్న గౌడ్, జినుగ సురేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, మహేందర్, సుదర్శన్‌రెడ్డి, ఉస్మాన్, నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తమ ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న క్రమంలో ఆనందంలో మునిగితేలారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశాడు. ట్రస్టు ఏర్పాటు చేసుకుని పేద స్నేహితులను ఆదుకోవాలని, కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు దేవకర్ణ, సదానందం, రమేశ్ బాబు, జగన్నాథం, వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మచ్చిక రాజు, కొలువుల రాజమల్లు, బండారి రాజేందర్, కొమ్మెర రవి, పుట్టపాక రాజేందర్, శ్రీరామోజు కిరణ్, జన్ను కిరణ్, పెండ్యాల తిరుపతి, శిరీశ, సుజాత, రాధిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలే 'ఎస్‌ఆర్‌ఆర్' ధ్యేయం

- ఫౌండేషన్ చైర్మన్, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : సామాజిక సేవలే ధ్యేయంగా ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఆదివారం ఆయన పలు కార్యక్రమాలు చేపట్టారు. జగన్నాథపల్లి, ఊకల్ గ్రామాల్లో యువతకు క్రికెట్ కిట్లు అందజేశారు. అలాగే సూర్యతండా, ఏకేతండా, మైలారం, జానకమ్మతండతండా, మొరిపిరాల, తదితర గ్రామాల్లో పలు కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు నగదు అందించారు. అనంతరం సూర్యతండాలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పేద కుటుంబాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందించడాన్ని సామాజిక బాధ్యతగా చేపట్టినట్లు తెలిపారు. యువతకు, కుల సంఘాలకు, ఇబ్బందుల్లో ఉన్న వారికి సేవలు అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు సుపరిపాలన అందిందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన ఘనత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు దక్కుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపు దిశగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, మధూకర్‌రెడ్డి, జాజు నాయక్, గారె నర్సయ్య, ఐత రాంచందర్, సుధాకర్, కుందూరు యాదగిరిరెడ్డి, యూసుఫ్, ఎల్లస్వామి, సాయి, హలావత్ రమేశ్, మూనావత్ వెంకన్న, మూడు రవీందర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం.. ఒకరిపై కేసు



నర్సంపేట రూరల్ : ఓమ్ని వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గుట్కా, అంబర్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకోని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. నర్సంపేట నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న వాహనంలో గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో నర్సంపేటలోని సర్వాపురం గ్రామ శివారులోని బంక్ వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓమ్నీ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.2 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు లభించాయి. గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి తరలిస్తున్న ముత్తినేని వీరన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్సై రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బషీర్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ బషీర్ కోరారు. పట్టణంలోని భారతి కళాసమితి ఆవరణలో యూనియన్ పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి మండలాలకు చెందిన వివిధ రంగాల కార్మికులతో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి బషీర్ హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లుగా సవరించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసేలా పోరాడాలని కోరారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య మాట్లాడుతూ ఐక్యపోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని, సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. అనంతరం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రేణుక, చైతన్య, అన్నపూర్ణ, భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు సుంకరి భిక్షపతి, అక్బర్, దుస్స రంజిత్, అంగన్‌వాడీ కార్మిక సంఘం నాయకులు పద్మ, స్వరూప, రేణుక, భారతి, అరుణ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

దళితుడిని బీజేపీ అధ్యక్షుడిగా చేయాలి

- డీఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి


మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే దళితుడిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. పట్టణంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి కుమారస్వామి అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ కులగణనను పార్లమెంట్‌లో ఆమోదించాలని, ఎన్నికల హామీ మేరకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయాలని, పార్లమెంట్ ఎదుట 200 అడుగుల ఎత్తుతో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారుమూల యాకూబ్, పట్టణ అధ్యక్షుడు మునిగాల అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్ల మిథున్, బరిగల బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి

దామెర : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ఓగ్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంచినీళ్ల వజమ్మను (47) ఈనెల 26న వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. స్థానికులు ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన గీత కార్మికుడు చెంగల సురేశ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన క్రమంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘాల నాయకులు బొనగాని యాదగిరి, జనగాం శ్రీనివాస్, అనంతుల రమేశ్, పులి మోహన్, ప్రముఖ న్యాయవాది విక్రమ్, గౌడ సంఘం అధ్యక్షుడు చెంగల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సురేశ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన సంతాప సభకు వారు హాజరై నివాళులర్పించి మాట్లాడారు. కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సురేశ్ మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు రావు పద్మ, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీరామ్ భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ మాసం గోరింటాకు వేడుక


అరచేతుల్లో గోరింటాకు

వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకను ఆదివారం జరుపుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో అధ్యక్షురాలు కళావతి నేతృత్వంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఆషాఢ మాసంలో గోరింటాకు కార్యక్రమం ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటి ఆడబిడ్డలకు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టడం తమ సంప్రదాయం అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటిపల్లి రాజమణి, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ తాటిపల్లి సుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోరంట్ల సంపూర్ణ, గట్టు ధనలక్ష్మి, అల్లాడి వనజ, రజిత, రమాదేవి, పెండ్యాల వాసవి, వీరమని వాసవి, గిరిజ, సుకన్య, రమ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

హన్మకొండ: ఆశ్రమ, వీధి బాలుర ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద ఆటో డ్రైవర్ల పిల్లలకు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగులు, బధిరుల ఆశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రన్ ఆర్గనైజేషన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో రన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ప్రియాంక, శ్రీకాంత్, స్పందన ఆశ్రమ బాధ్యురాలు సుచరిత, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

'ఫోర్జరీ సంతకంతో మోసం'

గూడూరు : గ్రామ పంచాయతీ తీర్మానంలో తన పేరుతో ఫోర్జరీ సంతకం చేసి మత్స్య అధికారితో చేపల చెరువు తమ పేరుతో రాయించుకొని దామరవంచ కోయలు మోసం చేశారని మాజీ సర్పంచ్ ధరావత్ కొమ్మాలు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని దామరవంచ ఊర చెరువులో తాను సర్పంచ్‌గా సేవలు అందించిన కాలంలో ఆ గ్రామ పరిధిలోని కోయ, లంబాడ గిరిజనులు ఊర చెరువులో చేపల పెంపకం చేసుకున్నామని తెలిపారు. కానీ కోయ గిరిజనులు తనపై కక్ష సాధింపుతో గ్రామ పంచాయతీ తీర్మానంలో సర్పంచ్‌గా తాను సంతకం పెట్టినట్లు ఫోర్జరీ చేసి, జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయ అధికారి ద్వారా ఊర చెరువులో చేపలు పట్టుకునే అధికారం ఒక వర్గానికే ఉందని రాయించుకుట్లు తెలిపారు. తన సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, లంబాడీలకు చేపలు పట్టుకునే హక్కు కల్పించాలని కొమ్మాలు ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.